క్లుప్తంగా

చికెన్ దుకాణాల తనిఖీ

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో ఆదివారం చీరాలకు చెందిన తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని నాలుగు చికెన్ దుకాణాలను పరిశీలించి జాగ్రత్తలు చెప్పారు. తూనికలు, కొలతల్లో తేడాలు లేకుండా వ్యాపారం చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కొలతల్లో తేడాలు ఉన్న దుకాణాలపై అధికారి నాగేశ్వరరావు కేసులు నమోదు చేశారు.

టెట్, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ వెల్ఫేర్ నుంచి టెట్, డీఎస్సీలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు భావపురి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాపట్లలో ఉచితంగా అందిస్తున్న టెట్, డీఎస్సీ పరీక్ష ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో టెట్, డీఎస్సీ శిక్షణ కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భావపురి విద్యాసంస్థల ఆధ్వర్యంలో అందించే శిక్షణను ముస్లిం, దూదేకుల నూర్‌బాషా, క్రిష్టియన్, జైన్, సిక్కు, అభ్యర్థులకు ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 25వరకు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని చక్కని ప్రతిభ చూపాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవల వెంకటేశ్వర్లు, ప్రతినిధులు, సభ్యులు ఉన్నారు.

నేడు చెరుకూరులో కౌలు భూముల వేలం

చినగంజాం (పర్చూరు): మండలంలోని చెరుకూరులోని త్రివిక్రమ, అగస్తేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో 320 ఎకరాల దేవుడి మాన్యం భూములకు కౌలు వేలం పాట జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 29వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు వేలం నిర్వహిస్తారని చెప్పారు. పాటలో పాల్గొనాల్సిన వారు రూ. 10 వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. వేలం మూడేళ్లకు జరుగుతుందని అధికారులు వివరించారు. వేలం పూర్తి అయిన వెంటనే ఎక్కువ పాటదారుడు ఒక సంవత్సరానికి సంబంధించి కౌలు మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి ఏడాది చెల్లించే కౌలు జూన్ ఒకటో తేదీలోపు చెల్లించాలని తెలిపారు. దేవదాయశాఖకు బకాయి ఉన్నవారు, కోర్టు కేసులు ఉన్న వారు పాటలో పాల్గొనడానికి అనర్హులని, ఈవేలం 31వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

31 నుంచి పందిళ్లమ్మతల్లి తిరునాళ్లు



పందిళ్లమ్మ తల్లి మూల విరాట్

వేటపాలెం: పందిళ్లపల్లి గ్రామ శివారులో పంట పొలాల మధ్యలో వేంచేసియున్న పందిళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఈనెల 31 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న అంకమ్మ, పోలేరమ్మలకు చద్ది నైవేద్యాలు, సాయంకాలం మహాలక్ష్మమ్మకి వడపప్పు పానకాలు చెల్లింపులు. ఆగస్టు 1వ తేదిన పోతురాజుకు వడపప్పు, పానకాలు చెల్లింపు, 2వ తేదిన పందిళ్లమ్మకి వడపప్పు, పానకాలు చెల్లింపు. 3వ తేది శిడిమహోత్సవం, 4న అమ్మవారికి పొంగళ్ల చెల్లింపుతో తిరునాళ్లు ముగుస్తుంది.

పర్యాటకుల భద్రతకే ప్రాధాన్యత



తీర ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: సముద్రతీరానికి వచ్చే పర్యాటకుల భద్రతకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం ఆయన చీరాల మండలం వాడరేవు, రామాపురం బీచ్‌లలో పర్యటించారు. బీచ్‌ల వద్ద జరుగుతున్న వరుస ప్రమాదాలను అరికట్టేందుకు అమలు చేస్తున్న నూతన ఆంక్షలు గురించి పర్యాటకులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు సముద్రంలో గల్లంతై ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు దృష్ట్యా వాడరేవు, రామాపురం, కటారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెంలో ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నామన్నారు. గజ ఈతగాళ్లు, హెచ్చరికల బోర్డులు, పోలీసులను సముద్ర తీరం వద్ద అందుబాటులో ఉంచామన్నారు.

హెల్మెట్ లేకపోతే అంతే సంగతులు !

- త్వరలో అమలు కానున్న కొత్త వాహన చట్టాలు
- ఇప్పటికే ప్రజలకు ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన
- రంగంలోకి దిగిన పోలీసులు, న్యాయ వ్యవస్థ
- ఇకనుంచి భారీగా జరిమానాలు, శిక్షలు



హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

చీరాల రూరల్:

వాహనదారులు తస్మాత్ జాగ్రత్త. కొత్త వాహన చట్టాలు అమలులోకి త్వరలో రానున్నాయి. జూలై 1 నుంచే ఈ చట్టాలను అధికార యంత్రాంగాలు అమలుచేసేందుకు కసరత్తులు ప్రారంభించాయి. ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటుచేసి ముమ్మరంగా ప్రచారం చేపట్టాయి. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు గత పదిహేను రోజులుగా న్యాయశాఖా సిబ్బంది, న్యాయవాదులు, న్యాయమూర్తులు కూడా ఆయా పట్టణాలలోని ముఖ్య కూడళ్లు, కళాశాలలు, పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటుచేసి వాహనదారులకు, ప్రజలకు, విద్యార్థులకు ఆవగాహన కల్పించి వారిలో చైతన్యం కలిగిస్తున్నారు.

భారీగా ఉండనున్న జరిమానాలు..

గతంలో వాహనాలు ఎలా నడిపినా పోలీసులు చూసీచూడనట్లు వదిలేసేవారు. ఇకనుంచి అటువంటి వాటికి చెల్లుచీటీ కానుంది. కొత్త వాహన చట్టాలను పోలీసులు పకడ్బందీగా అమలు చేసేందుకు ముందుకు సాగుతున్నారు. వాహనదారులకు గతంలో జరిమానాలు, శిక్షలు విధించేవారు కాని ఇప్పటి నుంచి అవి తీవ్రతరం కానున్నాయి.

డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అంతే..

వాహనాలు నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోతే గతంలో చూసీచూడనట్లు వదిలేసే పోలీసులు ఇప్పుడు కొత్త వాహన చట్టాల ప్రకారం రూ. 5,000 వసూలు చేయనున్నారు.

డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో పట్టుబడితే..

మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులను గతంలో పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుల ద్వారా జరిమానాలు విధించేవారు. అయితే ప్రస్తుతం కోర్టుల ద్వారానే జరిమానాలు విధిస్తారు. కాకపోతే గతంలో మాదిరి కాకుండా చాలా తీవ్రంగా రూ. 10,000 జరిమానాలు విధించేందుకు సిద్ధమవుతున్నారు.

హెల్మెట్ లేకుంటే.. లైసెన్స్ రద్దు

ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో వాహనదారులు హెల్మెట్ లేకుండా నడిపితే రూ. 1,000 జరిమానాలు విధిస్తారు. జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేసే అవకాశం ఉంది.

ట్రిపుల్ రైడింగ్ చేస్తే...

ద్విచక్రవాహనాలు నడిపేవారు వాహనం వెళ్లే సమయంలో వాహనంపై ముగ్గురు ఉన్నట్లయితే (టిపుల్ రైడింగ్) కింద జరిమానాలు రూ. 1,200 నిర్ణయించారు.

ఇన్సూరెన్స్, సీటు బెల్ట్ లేకుంటే..

అలానే ద్విచక్ర వాహనాలు, త్రీ వీలర్స్ నడిపేవారు వాహనం నడిపే సమయంలో వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా తీసుకుని ఉండాలి. ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ. 2,000 జరిమానాలు విధిస్తారు. అలానే కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి, సీటు బెల్ట్ లేకుండా వాహనాలు నడిపితే రూ. 1,000 జరిమానాలు విధిస్తారు.

మైనర్లకు వాహనాలిస్తే పెద్దలకు శిక్ష..

చిన్న పిల్లలకు వాహనాలు నడిపే అవకాశం ఇవ్వద్దని కొత్త వాహన చట్టాలు చెప్తున్నాయి. చిన్న పిల్లలు రోడ్డు ప్రమాదాలు చేస్తే పెద్దలు కూడా శిక్షలకు గురవుతారు. ఇప్పటికే అనేక పోలీసు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కొత్త వాహన చట్టాలను అమలు చేస్తాం.

ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త వాహన చట్టాలను త్వరలో అమలు చేస్తున్నాం . అతి వేగంగా వాహనాలు నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపినా, మద్యం తాగి వాహనాలు నడిపినా జరిమానాలు, శిక్షలు భారీగానే ఉంటాయి. ప్రస్తుతం పాత పద్ధతినే కొనసాగిస్తున్నాం. త్వరలో కొత్త వాహన చట్టాలు అమలు కానున్నాయి. అందులో భాగంగా ప్రజలకు, వాహనదారులకు కొత్త వాహన చట్టాలపై సిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నాం.

– శేషగిరిరావు, ఒన్‌టౌన్ సీఐ, చీరాల

సమాజసేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం



షుగరు వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



అధిక సంఖ్యలో హాజరైన హృద్రోగులు

- ఉచిత మగరు వైద్య శిబిరానికి భారీ స్పందన
- 1007 మందికి వైద్య పరీక్షలు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే రామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగర్ వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి హాజరైన 1007 మంది రోగులకు వైద్యులు రాజరాజేశ్వరి, పేట శ్రీకాంత్, సుధాకర్, లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ మాట్లాడుతూ గత 22 ఏళ్ల నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక మెడికల్ క్యాంపులు, పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, విద్యాభివృద్ధికి పూర్తి సహకారం, గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అనేక విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏడేళ్లుగా ప్రతి నెల ఉచిత షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నామని ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబడిపూడిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



అంబడిపూడిలో సున్నం బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు



వాడని తొట్లలో లార్వాను పరిశీలిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: మండలంలోని అంబడిపూడి గ్రామాన్ని పట్టిపీడిస్తున్న జ్వరాల బారి నుంచి విముక్తి కలిగించేందుకు గ్రామ పంచాయతీ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌గా పారిశుద్ధ్య కార్యక్రమాలతోపాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎం కుసుమకుమారి, సెక్రటరీ కేవీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామం, ఎస్సీ, బీసీ కాలనీలో సైడుకాలువలో సున్నం, బ్లీచింగ్ చల్లి ఎబేట్ పిచికారీ చేయించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది దోమల ఉత్పత్తికి చెక్ పెట్టేందుకు వాడని తొట్లు, రోళ్లు బోర్లించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మురికి కాలువలపై స్ప్రే పిచికారీతో పాటు ఆయిల్ బాల్స్ వదిలారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు వహించాలని ప్రజలకు సూచించారు. జలుబు, దగ్గు, జ్వరంతో అస్వస్థతలో ఉంటే తక్షణమే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ కోరారు.

వరుస చోరీలతో రైతుల బెంబేలు

బల్లికురవ: దొంగలు పథకం ప్రకారం కొత్తూరు గ్రామంలో సుమారు 10 వ్యవసాయ మోటార్లు, సోలార్ ప్లేట్లను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రాగి వైరును చోరీలకు పాల్పడ్డారు. రైతులు హంసావత్ కిషోర్ నాయక్, మెలికా ఆదినారాయణ, చక్కెర శ్రీనివాసరెడ్డి, మేడావత్తు హరినాయక్, అప్పట్లో విద్యుత్, పోలీస్‌శాఖకు ఫిర్యాదు చేశారు. వెలమవారిపాలెం, మైలవరం గ్రామంలో కూడా చోరీలు జరిగాయి. తాజాగా శనివారం అర్ధరాత్రి ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో ఏపీఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఉన్న వేణుగోపాల ఎత్తిపోతల పథకంలోని విలువైన మోటార్లు, ప్యానెల్ బోర్డులు చోరీకి గురైయ్యాయి. దొంగలు ఎత్తిపోతల పథక షట్టర్ తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి మోటార్లు అపహరించినట్లు రైతులు తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం పక్కనే ఐనాల రామారావు పొలంలోని వ్యవసాయ మోటారు చోరీకి గురైంది. ఈపథకం ద్వారా పసుమర్రు మేజర్‌లోని 1200 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. ఎంతో విలువైన మోటార్ల చోరీతో ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, వేమవరం, గోపాలం వారిపాలెం రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు వ్యవసాయ మోటార్లు చోరీకి గురికాకుండా దొంగలకు చెక్‌పెట్టాలని రైతులు వేడుకుంటున్నారు.



ఉప్పుమాగులూరులో చోరీకి గురైన ఎత్తిపోతల పథక మోటారు

గ్రామదేవతలకు పూజలు

బల్లికురవ: ఆషాఢ మాసం ముగింపు అష్టమి సందర్భంగా ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లకొండకు దిగువభాగంలో వేంచేసిఉన్న ఈర్లగంగమ్మకు ఆషాఢమాసం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి చీరెసారె పెట్టి తమతమ మొక్కులు చెల్లింపుకున్నారు. గుంటుపల్లి, అంబడిపూడి వల్లాపల్లి, బల్లికురవ, కొణిదెన, వైదన, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ మహలక్ష్మమ్మ నాభిశిలకు ప్రత్యేక పూజలతో వర్షాలు కురవాలని వార్లు పోసి పొంగళ్లు పెట్టారు.

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు.

బైకును ఢీకొట్టిన కారు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటన సోమవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు స్థానిక ముజావారిపాలేనికి చెందిన కాలేషాబాబు, జిన్నాబాబులు ఉదయం బైకుమీద శింగరకొండ సమీపంలో ఉన్న స్టేడియానికి వెళ్లి బైకుమీద ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో పట్టణంలోని కూకట్ల కన్వెన్షన్ వద్దకు రాగానే వెనుకనుంచి వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈఘటనలో బైకుమీద ఉన్న ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రామ చావిడిపై కలెక్టర్‌కు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

చీరాల టౌన్: శిథిలావస్థలో ఉన్న గ్రామ చావిడిపై అధికారుల్లో చలనం వచ్చింది. చీరాలలోని ఎంజీసీ మార్కెట్ ఎదురుగా ఉన్న గ్రామ చావిడి భవనాన్ని నూతనంగా నిర్మాణం చేసి కోట్లాది రూపాయల స్థలాన్ని వినియోగంలోకి తేవాలని శనివారం సాక్షిలో కథనాన్ని ప్రచురించింది. దీంతో ఆదివారం చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణ రెడ్డి గ్రామ చావిడి భవనాన్ని పరిశీలించారు. ఏళ్ల క్రితం చీరాల చావిడి భవనానికి కేటాయించిన స్థలం , శిథిలావస్థకు చేరిన భవనం తదితర రికార్డులను ఆర్డీవో పరిశీలించారు. చీరాల గ్రామ చావిడి భవనాన్ని నేలమట్టం చేసి నూతన భవనాన్ని నిర్మించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయానికి అన్నీ వివరాలతో నివేదికలు అందించామని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట ఇన్‌చార్జి తహశీల్దార్ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



శిథిలమైన గ్రామ చావిడి భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

పోలేరమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పణ

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని పోలేరమ్మ తల్లికి ఆషాడమాసం సారె వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 108 మంది మహిళలు సారె వస్తువులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ముందుగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారిని శాకంబరి అలంకారం చేశారు. అలానే పాతచీరాలలోని గ్రామదేవత అద్దంకమ్మ అమ్మవారికి దేవ్వ వంశస్తులు ఆడపడుచులు, గ్రామ ప్రజలు ఆషాఢ సారె సమర్పించారు. కార్యక్రమంలో దేవ్వ వంశస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



శాకంబరి అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



అద్దంకమ్మ అమ్మవారికి సారె అందిస్తున్న మహిళలు

మంచి కథా రచయిత రాఘవరావు

అద్దంకి: మంచి కథా రచయిత రాఘవరావు అని డీవీఎం సత్యనారాయణ అన్నారు. సాహితీ మిత్ర మండలి అద్దంకి ఆధ్వర్యంలో మారం వారి సేవాసదన్ ఆదివారం రాచపూడి వెంకటరాఘవరావుకు ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. ఈ సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన వహించారు. ఈ సభలో రాఘవరావు రచనలు, కవితలు గురించి అన్నమనేని వెంకటరావు, డీవీఎం, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామ చంద్ర మూర్తి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, వారణాసి రఘురామశర్మ విశ్లేషించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాఘవరావు, మంచి కథా రచయితని, సద్విమర్శకడని, ప్రత్యేకించి చలం, శ్రీశ్రీ,, యండమూరి రచనలు, సినిమా సాహిత్యంపై మంచి పట్టున్న వాడని పేర్కొన్నారు. 40 సంవత్సరాలు పోస్టల్ డిపార్ట్‌మెంట్లో చక్కటి సేవలందించారాని గుర్తు చేశారు. అనంతరం రాఘవరావు దంపతులను సాహితీ మిత్ర మండలి, రోటరీ క్లబ్, జానపద కళాపీఠం, ఇతర సాహితీ సంస్థల వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు వామరాజు వెంకటేశ్వరరావు, లక్కరాజు విశ్వమోహన్, కేవీ పోలిరెడ్డి, కుందా సుబ్బారావు, మిట్టాకామేశ్వరశర్మ, నిమ్మరాజు నాగేశ్వర రావు, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, ఇనమనమెళ్లూరు శ్రీనివాసరావు, చెన్నుపాటి రామాంజనేయులు, పోస్టల్ ఉద్యోగులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



రాఘవరావు దంపతలను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

వాడివేడిగా మండల సమావేశం

మార్టూరు: మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సమావేశం ఆదివారం వాడిగా వేడిగా జరిగింది. ఎంపీపీ భుక్యా శాంతి బాయి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్న విద్యుత్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజలు, రైతులు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటుండగా ఏఈ శ్రీనివాసరావు సమావేశానికి హాజరు కాకపోవటం ఏంటంటూ బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యులు దండా హరిబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యరావు రాజుగారిపాలెం సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఎంపీటీసీ సభ్యులు కల్లే పల్లి శ్రీనివాసరాజు బొబ్బేపల్లికి చెందిన తాళ్లూరి కోటేశ్వరరావు ప్రధానంగా విద్యుత్ సమస్యలను ఏకరువు పెట్టారు. ఇదిలా ఉండగా సమావేశం ముగిసిన అనంతరం విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు విద్యుత్ సమస్యలు లేవనెత్తిన దండా హరిబాబును కలసి మండల విద్యుత్ సమస్యల గురించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు రూ.30 కోట్ల పనులకు ప్రతి పాదనలు పంపించినట్లు తెలిపారు. రైతులకు చెందిన వందలాది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని రాగి తీగ చోరీకి గురవుతున్న విషయంలో పోలీసు శాఖ తీరుని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పటానికి ఆ శాఖ అధికారులు ఎవరూ హాజరు కాలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి రాకపోవడంపై పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపీడీవో నితిన్‌ను నిలదీశారు. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రి సర్వే అనంతరం రైతుల భూముల క్రయవిక్రయాలు నెలల కొద్ది నిలిచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయిన విషయమై ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్న సమాధానం చెప్పడానికి రెవెన్యూ అధికారులు రాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించారు. సమావేశంలో ఉద్యానవన శాకాధికారి బి. హనుమంతు నాయక్ , ఏవో కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి హామీ పథక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి హనుమంతు నాయక్